


*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

(గత సంచిక తరువాయి)

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (44)

**రావుగారి ముచ్చట్లు**

మాయామర్మం లేకుండా మంచినే నమ్ముకున్నవారు కొందరుంటారు. వారి సమక్షం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది.

రావుగారి సమక్షం అలాంటిది. అతి తక్కువ పరిచయంలోనే ఆత్మీయంగా అనిపించడం రావుగారి మరో ప్రత్యేకత.

అందుకేనేమో– ఆయన విసురు మనకే తగిలినా ముచ్చటగా అనిపిస్తుంది. స్వోత్కర్షకు దిగినా విని ఆనందించేలా ఉంటుంది.

ఆయన సంభాషణాచాతుర్యానికి ముగ్ధుడినైపోయి ఓసారి అన్నాను– 'మీరు సాహిత్యంమీద దృష్టి పెడితే ఎంత బాగుండేదో!' అని.

దానికాయన నవ్వి, "ఆ విషయం నేను స్కూల్లో చదువుకునే రోజుల్లోనే గుర్తించాను. మీరు సాహిత్యంతో సరిపెట్టారు కానీ నేను చిత్రకారుణ్ణి కూడా!" అన్నాడు.

అప్పుడు సత్యవతి కలగజేసుకుని, "క్లాసులో మేస్టర్లు పాఠాలు చెబుతుంటే చిత్తు పుస్తకంలో– మేస్టర్లమీదా, తోటి విద్యార్థులమీదా వ్యాఖ్యలు రాసేవారుట ఈయన. మేస్టర్ల బొమ్మలు కూడా గీసేవారుటలెండి. అదీ గొప్పగా చెబుతున్నారు" అంది.

"గొప్పగా చెప్పక! క్లాసయ్యేక క్లాసు క్లాసంతా, నా చిత్తు పుస్తకం చూడ్డానికి విరగబడేది మరి!" అన్నాడు రావుగారు.

"వాళ్లు మీ కొంటెతనాన్ని ఎంజాయ్ చేసేవారు. కొంటెతనం పాండిత్యమైపోదు!" అంది సత్యవతి.

"పువ్వు పుట్టగానే పరిమళించిందననుకోవచ్చుగా" అన్నాడు రావుగారు.

"మీ విషయంలో పదం మార్చి– పువ్వు పుట్టగానే వాసనేస్తుందిగా అనాలి. అది పరిమళమా, కంపా అన్నది పువ్వునిబట్టి ఉంటుంది"

రావుగారి వాక్చాతుర్యానికి పదును పెట్టడానికి దీటైన అర్ధాంగి ఆమె.

రావుగారు వెంటనే, "అరే, ఓసారి నా చిత్తు పుస్తకం చూసిన మా మేస్టారు కూడా అచ్చం ఇదే మాటన్నారు..." అని ఆశ్చర్యం నటించి, "అప్పట్నించీ నేను సాహిత్యం, చిత్రకళ జోలికి వెడితే ఒట్టు" అన్నాడు.

"ఓహో, బాగా దేహశుద్ధి జరిగిందన్నమాట!" నవ్వింది సత్యవతి.

రావుగారు నావైపు తిరిగి, "ఇన్నేళ్లకి మళ్లీ ఆ నాటి నా ప్రతిభ పరిమళమేనన్న అనుమానం పుడుతోంది. మీరు నా గురించి సీరియస్‌గానే ఆ మాటన్నారు కదూ!" అన్నాడు.

నేను నవ్వాపుకుని, "ఆత్మీయులముందు మనసులు పరచినప్పుడు, జ్ఞాపకాల లోతుల్లోంచీ ఎన్నో విశేషాలు గుర్తుకొచ్చి మనసుని ఆహ్లాద పరుస్తాయి. ఈరోజు మన మాటల్లో చదువుకునే రోజుల్లో నా చిత్తు పుస్తకం గుర్తొచ్చింది" అని టాపిక్ మార్చాను.

అప్పట్లో అందరికీ అలా చిత్తు పుస్తకాలుండేవి. క్లాసులో మేస్టర్లు పాఠాలు చెబుతున్నప్పుడు ముఖ్యమైన పాయింట్లు రాసుకోవడానికీ, ఇంటిదగ్గర లెక్కల హోంవర్కు ముందుగా చెయ్యడానికీ అది వాడేవాళ్లం. అవసరమైనవి తర్వాత వేరే నోట్ పుస్తకాల్లోకి ఫెయిర్ చేసేవాళ్లం. ఐతే రావుగారిలాగే చాలామంది చిత్తు పుస్తకాన్ని కొంటెపనులకీ ఉపయోగించేవాళ్లు. నేనైతే వేరేవాటికీ వాడేవాణ్ణి

అందులో ఒకటి– రోజువారీగా నమస్కార బాణేశుల జాబితా. ప్రతిరోజూ ఏదో సమయంలో ఎవరికో ఒకరికి నమస్కరిస్తుంటాం కదా! అలా మొదటి దణ్ణం అందుకున్న వారు నమస్కార బాణేశులు. నెల తర్వాత చూసుకుంటే ఆ జాబితాలో ఎక్కువమంది స్కూల్ టీచర్లే ఉండేవారు. వాళ్లలో నాకిష్టులైన టీచర్లు ఒక్కసారి కూడా నమస్కార బాణేశులు కాకపోతే బాధగా అనిపించేది. పనికట్టుకుని ఎవరినైనా నమస్కార బాణేశుల్ని చెయ్యాలని పూనుకున్నా ఫలితం నా చేతిలో ఉండేది కాదు. ఎందుకంటే, ఎదురైన కొందరు పెద్దలకి ఇష్టమున్నా లేకపోయినా చేతులు జోడించక తప్పదు కదా!

ఇంకా ఆ జాబితాలో ఊహకందని పేర్లుండేవి. ఒకసారైతే నాతో కంబైండ్ స్టడీసుకొచ్చిన వీరభద్రంతో ఏదో వాదనొచ్చి, "బాబూ! నీకో నమస్కారం. ఇక వాదన ఆపు" అన్నాను. ఆరోజుకి అతడే నమస్కారబాణేశుడు.

రెండోది నేటి మేటి పాట. అదేంటంటే– ఒక్కణ్ణే అయినప్పుడు ఇంటాబయటా కూడా సినిమా పాటలు హమ్ చేసుకోవడం నా అలవాటు. బుర్రలో పాట మాత్రమే ఉండేదేమో, ఎదుటపడ్డ పరిచయస్థుల్ని కూడా గుర్తించలేకపోయేవాణ్ణి. అలా ప్రతిరోజూ ఎక్కువసేపు హమ్మింగు చేసుకునే పాటని చిత్తు పుస్తకంలో 'నేటి మేటి పాట' అని రాసుకునేవాణ్ణి. నెల్లాళ్ల తర్వాత ఆ 'నేటి మేటి పాట'ల జాబితా చూసుకుంటే– అందులో బాగా ఇష్టమైనవే కాదు, బొత్తిగా నచ్చనివీ ఉండేవి. ఉదాహరణకి దేవాంతకుడు చిత్రంలో 'గోగ్ గోగ్ గోగ్ గోగ్ గోంగూరా' నాకెంతో ఇష్టం. 'భళిరా నీవెంత జాణవౌదురా' అంటే విసుగు. కానీ ఓ రోజు జాబితాలో అదే నాటి మేటి పాట.

చిత్తు పుస్తకంలోకెక్కిన ఈ జాబితాలు నాకో ప్రయోగఫలితంలా అనిపించేవిః ఒకోసారి మనమేం చేస్తామో మనకే తెలియదనీ, మన చేతిలోనే ఉన్నాయనుకున్నవి కూడా మన చేతిలో లేనివేననీ– ఆ జాబితాలు నాకు స్పష్టం చేశాయి.

ఈ వివరాలు విన్న రావుగారు నవ్వి, "నమస్కారబాణేశుడి మాట పక్కన పెడితే, పాటకు సంబంధించి అదన్నమాట సంగతి!" అన్నాడు.

"సంగతి అంటే– పాట సంగతా? పాటలో సంగతా?" అడిగింది సత్యవతి వెంటనే.

రావుగారు నావైపు తిరిగి, "అది మా ఆవిడకి తర్వాత చెప్తా కానీ, మీ 'నేటి మేటి పాట'ల జాబితా ఓసారి నాకు చూపిస్తారా?" అన్నాడు.

తెల్లబోయాను, "అప్పటి చిత్తు పుస్తకాలు ఇంకా ఎక్కడుంటాయ్– ఎప్పుడో పోయాయ్" అన్నాను.

"నేనడిగింది అప్పటివి కాదు. ఇప్పటివి" అన్నాడు రావుగారు.

సత్యవతిగారు కలగజేసుకుని, "ఇది చాలా బాగుంది. మీరిప్పటికీ చిత్తు పుస్తకాల్లో బొమ్మలు, వ్యాఖ్యలు రాస్తున్నారా?" అంది.

"నా సంగతి వేరు. కానీ ఈయన ఇప్పటికీ రోడ్లమీద పాటలు హమ్ చేస్తున్నారు కదా! నోట్ చెయ్యకుండా ఉంటారా?"

"మీరు విన్నారా?" ఎక్కదీసింది సత్యవతి.

"ఇందాకా– అదీ సంగతి అన్నాను కదా! ఆ సంగతి ఇదే! శనివారం సంత వీళ్లింటిముందే కదా! మొన్న శనివారం సంతలో ఈయన నాకు ఎదురుపడ్డారు. చిన్నగా నవ్వాను. తనూ నవ్వినా, ఆ నవ్వు నన్ను చూడ్డానికి ముందునుంచీ ఉన్నదే! అందుకని ఓసారి హలో అని పలకరించాను. పెదాలు కదులుతున్నాయి కానీ ఆ పెదాల కదలిక కూడా నేను పలకరించడానికి ముందునుంచీ ఉన్నదే! ఏదో తనలో తనే అనుకుంటూ, మహదానందపడిపోతూ నన్ను దాటి వెళ్లిపోయారాయన. తర్వాత చూస్తే, ఓ దుకాణం వద్ద ఆగి మామూలుగా బంగాళాదుంపలు బేరం చేసి కొన్నారు. ఇందాకా నన్ను చూడలేదేమో అనుకుని మళ్లీ దగ్గరకెళ్లి పలకరిస్తే– అదే చిరునవ్వు, అదే పెదాల కదలిక. నాకేసి మాత్రం శూన్యంలోకి చూసినట్లే చూస్తున్నారు. ఆయన మళ్లీ మామూలు మనిషైంది– వంకాయలు కొనడానికే. నేను కూడా ఏ చిక్కుడుకాయలో, పచ్చిమిర్చో ముందేసుకుని కూర్చుంటే తప్ప నాతో మాట్లాడరనిపించి, అప్పటికాయన్ని వదిలేశాను. ఐతే ఆయన ఎందుకలా చేశారో అప్పుడర్థం కాలేదు. ఇప్పుదర్థం కావడంతో– అదీ సంగతి అన్నాను. అది పాటలో సంగతో, పాట సంగతో నువ్వు తేల్చుకో" అన్నాడు రావుగారు.

విషయం నాకు అర్థమైంది.

నాలో నేను పాడుకుంటూ బయట నడవడం నాకు అలవాటే. రావుగారు నన్నలా చూసుంటాడు. అలంకారప్రియుడు కదా, అతిశయోక్తి వాడాడు. అది నాకు కాస్త గుచ్చుకునే అలంకారమయింది.

ఏమనాలో తెలియలేదు. అంతలో శ్రీమతి, "మీరు బయటి మాట చెప్పారు. ఈయన ఇంట్లోనూ ఇంతే! ఒకోసారి నాకు అన్వయించే పాట పాడుతూ కూడా నన్ను చూడరు. ఇప్పుడు మీరు చెప్పేక మారతారేమో చూడాలి" అంది.

"పుండుమీద కారం చల్లడమంటే ఇదే!" అన్నాను.

శ్రీమతి వెంటనే, "మరి మీకు ఇష్టమైనది కారమే కదా!" అంది.

పుండుమీద మరింత కారం!

రావుగారు చప్పట్లు కొట్టి, "బాగా చెప్పారు" అని నావైపు తిరిగి, "మీరిక స్వీట్లు తినడం మొదలెట్టాలి. లేకపోతే ఇలాంటి విసుర్లు ఎదుర్కోక తప్పదు" అన్నాడు.

ఆయన అలాగనడానికి కారణముంది. ఆయనకు మన సంప్రదాయపు పిండివంటల్లో బూరెలు, బొబ్బట్లు– స్వీట్లలో మైసూర్‌పాకు చాలా ఇష్టం. అవేవీ నేను వేలేసి ముట్టుకోనని తెలిసి చాలా నొచ్చుకుంటూ ఉండేవారు.

"స్వీట్లు అలవాటు చేసుకుందామనే, నిమ్మతొనలతో మొదలెడదామనుకున్నాను. బయట ఆటోమేట్లలో (ఆటోమాటిక్ వెండింగ్ మెషీన్లు) డబ్బులేసి ఓ ప్యాకెట్ తీసుకుందామంటే– జేబులో పర్సుండదు. చిల్లరుండదు" నిట్టూర్చాను.

"ఎందుకని?" రావుగారి కుతూహలం.

"ఏంచెప్పను? పర్సు తనవద్దనే ఉంచుకుంటుంది తప్ప, నాకివ్వదు తను. నాకు పాంటు టైటు కాబట్టి జేబులోకి పర్సు వెళ్లదంటుంది. చొక్కాకేమో జేబుల్లేవు. పోనీ ఓవర్‌కోట్లో పెట్టుకుంటానంటే, ఆఫీసుకెళ్లేక బయట తగిలిస్తాను కాబట్టి డబ్బులు పోవచ్చంటుంది. కాస్త చిల్లరైనా ఉంచొచ్చుగా అని గట్టిగా అడిగితే, ప్రయాణానికి 'ఊబాన్ పాసుందిగా, మేమెవ్వరం పక్కన లేకుండా మీకు డబ్బుతో పనేమి టంటుంది" అని వాపోతున్నట్లు నటించాను.

అందులో కొంత నిజముంది. బయట ఆటోమేట్లలో చిన్నసైజు పిప్పరమెంట్ల పాకెట్లు దొరుకుతాయి. చాలా రుచిగా ఉంటాయవి. నాకోసం కాకపోయినా పిల్లలకోసం తీసుకుందామంటే జేబులో డబ్బుండదు.

ఏదో తెలివిగా మాట్లాడేననుకున్నాను కానీ రావుగారికి దొరికిపోయాను. ఆయన వెంటనే, "పాపం, మీవారంత నొచ్చుకుంటున్నారు. రేపట్నించి ఆయన బయటికెళ్లేటప్పుడు ఓవర్‌కోట్ జేబులో కాసిని నిమ్మతొనలు పోస్తుండండి" అన్నాడు.

అంతా ఘొల్లుమన్నారు. అబద్ధమెందుకూ– ఘొల్లుమన్నారు కాదు, ఘొల్లుమన్నాం అనాలి. ఎందుకంటే అందరితో పాటే కాదు, అందరి కంటే కూడా నేనే గట్టిగా నవ్వాను.

అదీ రావుగారు!

మేమూ వాళ్లూ మరీ ఎక్కువగా కలవకపోయినా– బెర్లిన్ అంటే రావుగారు మాత్రమే గుర్తుకొచ్చేంత దగ్గరయింది మాకాయన కుటుంబం.

పిల్లల జన్మదినాలకు మేమూ వాళ్లూ తప్పక కలుసుకునేవాళ్లం.

పుట్టినరోజు కానుకలకోసం మేము మనసు పెట్టి చాలా షాపులు తిరిగేవాళ్లం. ఆ తిరగడం మా పిల్లలకూ ఇష్టంగా ఉండేది. ఎందుకంటే– ఆ గిఫ్టు ఐటమ్సు బాగా నచ్చేసి మా వాళ్లకీ కొనేవాళ్లం.

అలా మేము వాళ్ల బాబుకోసం గ్రే కలర్ ఆటోమాటిక్ కారు బొమ్మ కొన్నాం. అది రిమోట్‌తో నడిచేది, మలుపులు తిరిగేది. దారికి ఏదైనా అడ్డమొస్తే దానంతటదే పక్కకు తప్పుకుని ముందుకెళ్లేది.

వాళ్ల పాపకోసం పసుపు పచ్చని రోడ్ క్లీనింగ్ వ్యాన్ కొన్నాం. బెర్లిన్ రోడ్లమీద తిరిగే వ్యాన్లకి అది మూస. బ్యాటరీ ఆన్ చెయ్యగానే అంబులెన్సులా హారన్ మోగిస్తూ కదిలేది. దాని అడుగున వాక్యూమ్ క్లీనింగుకి తిరిగే చక్రం ఉండేది.

ఇవి మా పిల్లలకి కూడా కొన్నాం. వాటితో పిల్లలకంటే ఎక్కువగా మేమే ఆడేవాళ్లం. మరి చిన్నప్పుడు మాకిలాంటి సరదాలు తీరలేదుగా!

“ఇలాంటివన్నీ మీకెక్కడ దొరుకుతాయి?” అని అబ్బురంగా అడిగేవాడు రావుగారు.

“మీరు ఇక్కడే ఉండేవారు. ఏం కావాలన్నా నిదానించొచ్చు. మేము త్వరలో వెళ్లిపోయేవాళ్లం. మళ్లీ ఎప్పుడైనా వస్తామో లేదో తెలియదు. వీలైనన్ని అపురూప వస్తువులు కూడా తీసుకెళ్లాలనంటే తొందరపడాలి. అందుకని షాపులు తెగ తిరుగుతుంటాం. ఏవేవో కొంటుంటాం. డబ్బు దాచుకోవడం మంచిదని మిత్రులు కొందరంటారు కానీ, డబ్బుదేముంది– ఎప్పుడైనా సంపాదించొచ్చని నేనంటాను” అన్నాను.

రావుగారు నవ్వి, “ఏమనుకోనంటే నాదో చిన్న సలహా. మీరంటున్న ఈ అపురూప వస్తువులు ఎప్పటికీ అపురూపంగా ఉండిపోవు. కొన్నాళ్లకివి ఇండియాలోనూ మామూలైపోతాయి. అదీకాక టెక్నాలజీ త్వరగా వృద్ధి చెందుతోంది. నేటి వింత రేపటికి పాతబడి రోతగా మారిపోతోంది. కాల్క్యులేటర్లే చూసేరుగా– ఒకోటి తొమ్మిదొందల తొంబైఎనిమిది మార్కులుండేది– ఆర్నెల్లలో నూట తొంబైఎనిమిది మార్కులకి పడిపోయింది. అవసరానికి ఏమైనా కొనుక్కోండి. ఐతే ఖర్చు చేసేటప్పుడు, ముఖ్యంగా మధ్యతరగతివాళ్లకి, అన్నింటికన్నా డబ్బే ప్రధానమని గుర్తుంచుకోండి” అన్నాడు.

అది అనుభవంలోంచి పుట్టిన మాట. బాధ్యతలెరిగిన మనిషి వాస్తవిక దృష్టితో స్నేహభావంతో పలికిన మాట!

అప్పటికది ఆచరించాలని అనిపించిందని చెప్పలేను కానీ, మధ్యతరగతి జీవితానికది విలువైన హితవాక్యమని ఇప్పటికీ మర్చిపోలేదు.

రావుగారిలా దగ్గరైనవారు బెర్లిన్లో మరికొందరు లేకపోలేదు. ఆదిలో ఓంప్రకాష్. అతడిద్వారా లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టల్లో మరికొందరు. అక్కడే నా ల్యూనబర్గ్ క్లాస్‌మేట్ గుప్తా. ఇంకా ప్రసాద్ దంపతులు వగైరా. లాబొరేటరీలో అహమ్మద్, హైనర్ డెకర్ట్ వగైరాలు.

వీరంతా చిరకాల పరిచయంవల్ల దగ్గరైనవారు. కానీ స్వల్పకాలంలో ఊహించనంతగా సన్నిహితుడైనవాడు శోభన్ ఘోష్.

**శోభన్ ఘోష్ ముచ్చట్లు**

తండ్రి, తాత, అమ్మమ్మ, బామ్మ, అన్న, అక్క, తమ్ముడు, చెల్లి– వీరెంత దగ్గరివారైనా– కొన్ని విషయాల్లో స్నేహితులంత దగ్గర కాలేరు.

ఎందుకంటే– బంధుత్వం కారణంగా వారికీ మనకీ మధ్య కొన్ని పరిమితులుంటాయి.

బెర్లిన్లో రావుగారు మాకు ఆత్మబంధువు. శోభన్ సన్నిహితుడైన స్నేహితుడు.

అతడు బెంగాలీ. కెమికల్ ఇంజనీరు. పూనాలోని నేషనల్ కెమికల్ లాబొరేటరీలో సైంటిస్టు. నాతర్వాతి సంవత్సరం బ్యాచిలో డాడ్ స్కాలరుగా జర్మనీ వచ్చాడు. అతడితో పాటు భార్య, మా అబ్బాయికంటే కొంచెం చిన్నవాడైన కొడుకు వచ్చారు.

బెర్లిన్లో అతడి లాబొరేటరీ మా సంస్థకు దగ్గర్లోనే ఉంది. మాది కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ కావడం వల్ల తరచుగా మా లేబరేటరీకి వచ్చేవాడు.

చొరవగా కొత్తవాళ్లని పరిచయం చేసుకునే అలవాటు నాకు లేదు.

ఒకరోజు తనే వచ్చి నన్ను కలుసుకున్నాడతడు.

అందుకు కారణంగా అతడు చెప్పిన విషయాలు నన్నాశ్చర్యపరిచాయి.

అక్కడున్న ఇండియన్సులో నేను ప్రత్యేకమట. చాలా మంచివాణ్ణీ, స్నేహపాత్రుణ్ణీట.

ఈ మాట అతడికి కొందరు జర్మన్సూ, ఇండియన్సూ కూడా చెప్పారుట.

చుట్టుపక్కల నాకు ఇంత మంచిపేరుందని ఊహించలేదు. ముందు చాలా సంబరపడ్డాను.

అంతలోనే నాకు అనిపించింది. కొంతమంది పరిచయం చేసుకునే ముందు అలా చెబుతుంటారు. ఎవరిదాకానో ఎందుకూ– నేనే ఒకసారి ఎవరితోనో అవసరముండి పరిచయం చేసుకునేటప్పుడు, “మీ గురించి గొప్పగా విన్నాను” అంటూ మొదలెట్టాను.

అందుకని నా గురించి నేను మరీ ఎక్కువగా ఊహించుకోక, “నా గురించి నాలుగు మంచి మాటలు చెప్పడం వారి సహృదయత. అది నాకు చేరవెయ్యడం నీ సహృదయత” అనేసి అతడి వివరాలడిగి తెలుసుకున్నాను.

శోభన్ ముక్కు సూటి మనిషి. మనసులో ఏమున్నా కుండ బద్దలు కొడతాడు. ఎవర్నీ లక్ష్యపెట్టడు. అలాగని ఎవరితోనూ అనవసరంగా గొడవ పడడు. ఆ లక్షణాలు నాకిష్టం.

ఆ లక్షణాలవల్లే అతడికి అక్కడ స్నేహితులు తక్కువ. శత్రువులు కాకపోయినా కిట్టనివారు కూడా కొందరున్నారు. మంచి మిత్రుడికోసం ఎదురు చూస్తూ నా గురించి విని ప్రత్యేకంగా నన్ను కలుసుకుందుకు వచ్చానన్నాడు.

"నాలో ఏదైనా లోపం కనిపిస్తే మొహం మీదే చెప్పెయ్. ఏమనుకోను. నన్ను మాత్రం పక్కన పెట్టొద్దు" అన్నాడు శోభన్.

అది హెచ్చరికో, విన్నపమో అర్థం కాలేదు. కానీ అతణ్ణో రోజు మా ఇంటికి పిలిచాను.

అతడి భార్య కలుపుగోలు మనిషి. తనూ వేరే రాష్ట్రంలో కాంపస్ నుంచి వచ్చింది కాబట్టి హిందీ బాగానే వచ్చు. శ్రీమతికీ ఆమెకీ మాటలు బాగానే కలిశాయి. ఇక వాళ్లబ్బాయికీ మా పిల్లలకీ జత బాగానే కుదిరింది.

మొదటి రోజునే అంతా ఆత్మీయులమైపోయాం.

"మనమెప్పుడు కలుసుకున్నా నీ ఇంట్లోనే! అతిథుల రాక ఇక్కడ మా లాండ్‌లేడీకి ఇష్టముండదు" అని చెప్పాడతడు.

శోభన్ ముక్కు సూటి మనిషి కనుక– అదో వంకని నేననుకోలేదు.

ఆ మర్నాడే శోభన్ నన్ను ఆఫీసులో కలుసుకుని, "నిన్న మీ ఇంటికెందుకొచ్చామో తెలుసా? మన కుటుంబాల ఫ్రీక్వెన్సీ ఎలా కలుస్తుందో తెలుసుకుందుకు అదో ట్రయల్ రన్!" అన్నాడు.

ట్రయల్ రన్సు కెమికల్ ఇంజనీరింగ్ ప్రయోగాల్లో మామూలు. జీవితంలోనూ ఇంజనీరింగేనా అనుకుంటూ, "ట్రయల్ దేనికి?" అన్నాను.

"మీ పిల్లలు కాస్త పెద్దవాళ్లు. వదిలేస్తే ఎవరిదగ్గరైనా కొన్ని గంటలసేపు ఉండగలరు. పైగా వాళ్లకి ఒకరికొకరి తోడు ఉంటుంది. మా అబ్బాయి విషయమలా కాదు. వాణ్ణి ఎక్కడైనా వదిలి వెళ్లాలంటే, కాస్త చనువున్న పిల్లలు కూడా జతగా ఉండాలి. మీ పిల్లలు, మీరు ఉంటే వాడు గంటలేమిటి, రోజు రోజంతా మమ్మల్ని తల్చుకోకుండా గడిపెయ్యగలడని నిన్నటితో ధైర్యం కలిగింది" అన్నాడు శోభన్.

అతడు మమ్మల్ని తన కొడుక్కి బేబీ సిట్టర్సుగా ఉపయోగించుకోవాలని ఆత్రపడుతున్నట్లు అర్థమైంది. కానీ ఆ అవసరమేమిటో తోచక, "ఔననుకో– కానీ వాళ్లని వదిలి వెళ్లాల్సిన అవసరమేమిటి నీకు?" అన్నాను కుతూహలంగా.

"నేనూ మా ఆవిడా కీనోకి వెళ్లాలనుకుంటున్నాం" అన్నాడతడు.

ఉలిక్కిపడ్డాను.

కీనో అంటే సినిమా హాలు.

బెర్లిన్లో హాల్లో ఆడేవన్నీ జర్మన్ సినిమాలు. డబ్బు ఖర్చు పెట్టుకుని అర్థం కాని భాషలో సినిమాలు చూడ్డమెందుకూ అనుకునే ఎకానమీ నాది. అందుకని సినిమాహాలుకి వెళ్లాలని అనుకోను కూడా అనుకోలేదు.

ఐతే కీనో అనే పదాన్ని స్థానికంగా సెక్స్ కీనోకి కుదింపుగా వాడతారు. ఇండియన్సయితే మరీనూ.

“కీనోకి వెడదామనుకుంటున్నా! కంపెనీకి గర్ల్‌ఫ్రెండు కోసం చూస్తున్నా” అని కొలీగ్సు ముసిముసిగా నవ్వుతూ అనడం నాకు తెలుసు.

బెర్లిన్ నగరంలో అడుగడుగునా సెక్స్ కీనోలున్నాయి. ఎన్నో షాపింగ్ మాల్స్‌లో భాగంగానూ ఉన్నాయి.

సెక్స్ కీనోల్లో పోర్నో అంటే పచ్చి బూతు సినిమాలు చూపిస్తారు. వాటికి మార్నింగ్ షోలూ, మేట్నీలూ, మొదటాటలూ ఉండవు. రోజంతా పని చేస్తూనే ఉంటాయి. టికెట్ కొనుక్కుని వెళ్లి హాల్లో కూర్చోవడం. ఇష్టమైనంత సేపు కూర్చోవడం. అంతే!

ఒకో సినిమా నిడివి 5నుంచి 20 నిముషాలవరకూ ఉంటుంది. అలాంటివి పదో పదిహేనో ఉంటాయి. అన్నీ ఐపోయేక ఆట ఆగదు. మళ్లీ సైకిల్ మొదలవుతుంది.

“ఒక టికెట్ మీద హాల్లో ఎంతసేపైనా కూర్చోనిస్తే, హాలువాళ్లకి నష్టం కదా!” అన్నాను నేనోసారి లాబోరేటరీలో అహమ్మద్‌తో.

“నువ్వలా అనుకుంటున్నావా– నిజానికి టికెట్టుకి టైము నిర్ధారిస్తే నష్టపోయేది హాలు వాళ్లే” అన్నాడు అహమ్మదు.

“అదెలా?” అన్నాను ఆశ్చర్యంగా.

“ఆ చిత్రాలు చూస్తూంటే అక్కడే కూర్చోవాలనిపించదుగా. గర్ల్‌ఫ్రెండుతో వెళ్లినవాడైతే పది నిముషాల్లోనే అమెతో సహా బయటి కొచ్చేస్తాడు. టికెట్టుకి టైమ్ నిర్ధారిస్తే ఆ సీటు అలా కాళీగా ఉండిపోవాల్సిందేగా!” అని నవ్వి, “ఎవ్వరూ గంటకుమించి హల్లో కూర్చోరు. అలా కూర్చునేవాళ్లు ఆ సినిమాలు చూడ్డం వ్యర్థం” అన్నాడు అహమ్మద్.

అంతవరకూ ఊహకందని ఆ కోణం అప్పటికి తెలిసింది నాకు.

మా ఇంటామె ఒలోముచ్‌కీ కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ వద్ద ఓ సెక్స్ కీనోలో టికెట్లు అమ్మే ఉద్యోగం చేస్తోంది. ఆమె టైమింగ్సు ఉదయం తొమ్మిదినుంచి రాత్రి 9 వరకూ అనుకుంటాను. ఐతే ఆ పనివేళలు కాస్త అటూ ఇటూగా కూడా ఉంటుంటాయి.

బెర్లిన్లో కీనోలకి వెళ్లలేదు కానీ, నేను అలాంటి మూవీలు అప్పటికే కొన్ని చూశాను. ఆ అనుభవం అర్ధాంగికీ కావాలన్న మనసుంది కానీ, ఇక్కడ ఎలా వీలవుతుంది?

పిల్లల్ని కూడా తీసుకెళ్లలేం. వాళ్లని ఒంటిగా వదిలేసి వెళ్లలేం.

రావుగారినడుగుదామంటే, ఆయన బంధువుల కోవలోకి వస్తారు. కాబట్టి మామధ్య అటువంటి ప్రసక్తి రాను కాక రాదు.

ఇక్కడకొచ్చి తను చూడని వింతల్లో అదీ ఒకటిగా మిగిలిపోతుందని అసంతృప్తిగానే సరిపెట్టుకున్నాను.

కానీ శోభన్ అలా సరిపెట్టుకోలేదు. మనసుంటే మార్గముంటుందనుకున్నాడు. నన్ను వెతికి పట్టుకున్నాడు.

తనకి నేను మార్గమయ్యాను. నేనూ రావుగారి దగ్గర అలాంటి మార్గం చూడాల్సిందేమో!

“ఏం మాట్లాడవు?” అన్నాడు శోభన్.

“సాహసివిరా డింభకా!” అనుకుని, “మాట్లాడ్డానికేముంది? నీ ప్రపోజల్ నాకు ఓకే” అన్నాను.

“నీకు ఓకే కావచ్చు. కానీ నేనింకా ఓకే చెయ్యలేదు” అన్నాడు శోభన్.

తెల్లబోయి, “ఓకే చెయ్యకపోతే, అడగడమెందుకు?” అన్నాను.

“బొమ్మా బొరుసూ ఉంటేనే అది నాణెం ఔతుంది. నావైపు ప్రపోజల్ బొమ్మ. దానికి బొరుసు నీవైపు ప్రపోజల్” అన్నాడు శోభన్.

“అంటే?”

“అంటే ఏముంది? మా బాబుని మీ ఇంట్లో వదిలి మేము కీనోకి వెళ్లి వస్తాం. అప్పటికి మీరు సిద్ధంగా ఉండండి. మీరు కీనోకెళ్లి వచ్చేదాకా మేము మీ పిల్లల్ని చూస్తుంటాం. అదీ డీల్. ఇది నీకు ఓకే ఐతేనే, ఈ ప్రపోజల్. లేకుంటే ఇదిక్కడే మర్చిపోదాం” అన్నాడతడు.

నేనిది ఊహించలేదు, “నీకిష్టమై నువ్వెడుతున్నావ్. నన్ను బలవంతపెట్టడం భావ్యం కాదు” అన్నాను.

“హిపోక్రసీ వద్దు రావ్. ఇలాంటి సినిమాలిప్పుడు ఇండియాలోనూ రహస్యంగా వేస్తున్నారు. చూసేవాళ్లు రహస్యంగా చూస్తున్నారు. ఎందుకంటే ఆ సినిమాల ప్రదర్శన అక్కడ చట్టవిరుద్ధం. అదిక్కడ చట్టబద్ధం. ఆ సినిమా చూడ్డానికి భార్యతో సహా వెళ్లినా చెవులు కొరుక్కునేవారుండరు. ఇది మనకి సదవకాశమే కదా! ఐనా నాకు తెలుసు. భాభీజీతో కలిసి ఓసారి కీనోకి వెళ్లాలని నీకూ ఉంది. ఇక భాభీజీ అంటావా, మన సంప్రదాయాన్నిబట్టి మొహమాటపడినా, మనిషికి సహజమైన కుతూహలం ఉంటుందిగా. నువ్వు కాస్త బలవంత పెడితే తప్పక ఒప్పుకుంటుంది. నేనలాగే మా ఆవిణ్ణి ఒప్పించాను” అన్నాడు.

నేనింకా ఆలోచిస్తుంటే మళ్లీ తనే, “నేనీ ప్రపోజల్ పెట్టిందే నీకోసం. అందుకు ప్రతిఫలంగా నాకూ ఓ అవకాశం కోరుతున్నాను. ఎటొచ్చీ బెంగాలీ వాణ్ణిగా– స్వకార్యం అయ్యాకే స్వామికార్యం” అన్నాడు.

ఇప్పటివాళ్లకి ఇదంతా హాస్యాస్పదంగా ఉంటుందని తెలుసు. కానీ– అప్పట్లో ఈ ఏర్పాటుకి కారణం– అతి తక్కువ పరిచయంలో శోభన్ తీసుకున్న చొరవే కావడం ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది.

అలా కీనో విషయంలో– స్వకార్య స్వామికార్య సిద్ధి అనుకున్నట్లుగానే జరిగింది.

శోభన్ కుటుంబం మాకు అత్యంత సన్నిహితమైంది. ఎంతలా అంటే– ఇండియా వచ్చేక ఓ ఇరవై సంవత్సరాల తర్వాత కేవలం మమ్మల్ని చూడ్డానికే అతడోసారి భువనేశ్వర్ వచ్చాడు. వచ్చి ఊరుకున్నాడా– తన ముక్కు సూటితనం కలకాలం గుర్తుండిపోయేలా చేసి వెళ్లాడు.

అది స్మరించుకోవడానికి క్షణంపాటు కాలయంత్రంలో కొంచెం ముందుకెళ్లి, వెంటనే వెనక్కి వచ్చేద్దాం.....

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments